

www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY



సంపుటి: 02 | సంచిక: 261 | హైదరాబాద్ | బుధవారం | 14-01-2026 | పేజీలు: 08




## మేడారం జాతరకు ప్రత్యేక యాప్!

సచివాలయంలో ఆవిష్కరించిన మంత్రులు


మహా జాతరపై సమీక్ష సమావేశం

అధికారులకు కీలక సూచనలు

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

ఈ ఏడాది మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతరకు దాదాపు మూడు కోట్ల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని రాష్ట్ర మంత్రులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సీతక్క తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వంలోని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని వారు అధికారులను ఆదేశించారు. జనవరి 28 నుంచి 31 వరకు మూడు రోజుల పాటు మేడారం జాతర జరుగనుంది. ఈ నేపథ్యంలో మేడారం జాతర ఏర్పాట్లపై సచివాలయంలో నిర్వహించిన ఉన్నత స్థాయి ..మిగతా 2లో

## ఉగాది నాటికి టిమ్స్ హాస్పిటల్ ప్రారంభం



వెయ్యి పడకలతో ఆధునిక వైద్య సేవలు

చివరి దశకు చేరుకున్న నిర్మాణం

మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడి

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న టిమ్స్ హాస్పిటల్‌ను ఉగాది నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు. మంగళవారం సనత్‌నగర్ టిమ్స్‌లో కొనసాగుతున్న పనులను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. హాస్పిటల్ భవన ..మిగతా 2లో

## వీరభద్ర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

కేంద్ర మంత్రి బండి సంజయ్



02

## శంకుస్థాపనలు మీవి.. పనులు మావి..!


బీఆర్ఎస్ వైఫల్యాలపై గట్టి దాడి

కేటీఆర్ కు మున్సిపల్ 'సెమీఫైనల్' ఛాలెంజ్

కృష్ణా జలాల్లో రాష్ట్ర ప్రయోజనాలే ప్రధానం



02



## తెలంగాణ మున్సిపల్ ఎన్నికలకు అంతా సిద్ధం..

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తుది ఓటర్ల జాబితాను విడుదల చేసిన ఈసీ

117 మున్సిపాలిటీలు, 6 కార్పొరేషన్లకు ఎన్నికలు

రిజర్వేషన్ల ఖరారు అనంతరం నోటిఫికేషన్

ఎన్నికల నిర్వహణపై పురపాలకశాఖ కసరత్తు

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

తెలంగాణలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం తుది ఓటర్ల జాబితాను ప్రకటించింది. ఈ ఏడాది తెలంగాణలో 117 మున్సిపాలిటీల మరియు 6 కార్పొరేషన్ల ఎన్నికలు జరగనుండగా, మొత్తం 52,43,023 మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో హాజరు కావాల్సినవారుగా నమోదు అయ్యారు. ఈ ఓటర్లలో 25,62,369 మంది పురుషులు, 26,80,014 మంది మహిళలు, 640 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారు. పట్టణ ప్రాంతాల్లో మహిళా ఓటర్ల సంఖ్య పురుషుల కంటే ఎక్కువగా ఉండటం ఒక ప్రత్యేక గమనార్హ అంశం. ఈ వివరాలు రాష్ట్రంలో ఉన్న మున్సిపాలిటీల, కార్పొరేషన్ల ..మిగతా 3లో

## మీడియాపై సిట్ వేశారు సరే... మీ నేతల స్కాంలపై ఎందుకు వేయలేదు?

సీఎం, మంత్రి, ఓ ఐఏఎస్ అధికారిణిపై పోస్టులు

విచారణకు సిట్ వేసిన తెలంగాణ సర్కారు

తీవ్రస్థాయిలో స్పందించిన కేటీఆర్

పాలన వైఫల్యాల నుంచి దృష్టి మరల్చేందుకే

ఈ ఎత్తుగడలని విమర్శ

కాంగ్రెస్ నేతల అవినీతి,

కబ్జాలపై విచారణ ఏదని సూటి ప్రశ్న

మీడియా సంస్థలపై దర్యాప్తు పేరుతో వేధించడం సరికాదని హెచ్చరిక



**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పాలనాపరమైన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే ప్రభుత్వం తరచూ కమిషన్‌లు, ప్రత్యేక దర్యాప్తు బృందాల (సిట్) పేరుతో 'అటెన్షన్ డైవర్షన్ డ్రామాలు' ఆడుతోందని ఆయన ధ్వజమెత్తారు. ఒక మంత్రికి సంబంధించిన వార్తను ఉటంకించినందుకు మీడియా సంస్థలపై సిట్ వేయడాన్ని తప్పుబట్టిన కేటీఆర్, సొంత పార్టీ నేతలు చేసిన తీవ్రమైన ఆరోపణలపై మాత్రం ఎందుకు విచారణ జరపడం లేదని సూటిగా ప్రశ్నించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగాయని చెబుతున్న పలు ఘటనలను కేటీఆర్ తన ప్రకటనలో ఏకరవు పెట్టారు. "ఒక మంత్రి పీఏ, రేవంత్ సహచరుడు కలిసి పారిశ్రామికవేత్త తలకు తుపాకి పెట్టి రూ.300 కోట్లు డిమాండ్ చేస్తే ..మిగతా 3లో

## బాబుకు రేవంత్ సంక్రాంతి గిఫ్ట్..

రాష్ట్రానికి చారిత్రక ద్రోహం

జలహక్కులకు మరణశాసనం

పీఎన్ లింకుకు

ప్రభుత్వ పూర్తి సహకారం

విచారణార్హత లేని పిటిషన్

వేయడమే నిదర్శనం

బీఆర్ఎస్ రాజీ లేని పోరాటం

ఏపీకి మన నీటి

హక్కులు ధారాదత్తం

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో

రాజీలేని పోరాటాలకు


సిద్ధమవుతాం

మాజీ మంత్రి హరీశ్‌రావు



**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

విచారణ అర్హత లేని పిటిషన్ వేసి సీఎం రేవంత్‌రెడ్డి తన గురువైన చంద్రబాబుకు సంక్రాంతి గిఫ్ట్ ఇచ్చి తెలంగాణకు చారిత్రక ద్రోహం చేశారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. నిన్న సుప్రీంకోర్టులో తెలంగాణ ..మిగతా 2లో



## వీధికుక్కల నియంత్రణ బాధ్యత రాష్ట్రాలదే

చర్యలు తీసుకోకపోతే భారీ జరిమానాలు

సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు

జంతు ప్రేమికులపై తీవ్ర అసహనం

మనుషుల ప్రాణాలకూ విలువ ఇవ్వాలని సూచన

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

దేశవ్యాప్తంగా వీధికుక్కల బెడద పెరుగుతున్న నేపథ్యంలో సుప్రీంకోర్టు తీవ్ర స్థాయిలో స్పందించింది. వీధికుక్కల నియంత్రణలో రాష్ట్రాలు సరైన చర్యలు తీసుకోకపోతే భారీ జరిమానాలు జారీ చేస్తామని స్పష్టం చేసింది. కుక్కల దాడుల వల్ల పిల్లలు లేదా పెద్దలు గాయపడినా, ప్రాణ నష్టం జరిగినా సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలే పరిహారం చెల్లించాల్సి ఉంటుందని ..మిగతా 2లో

## ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ రికార్డ్

ఖరీఫ్ సీజన్‌లో 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

గతంలో 70.2 లక్షల మెట్రిక్ టన్నుల రికార్డును అధిగమించినట్లు వెల్లడి

రైతుల భాగస్వామ్యంతో రికార్డు సాధ్యమైందని వెల్లడి



02

## విజయ్ సినిమా విడుదలను కేంద్రం అడ్డుకుంటోంది...

విజయ్ సినిమా చుట్టూ రాజకీయ దుమారం

తమిళనాడు పర్యటనలో రాహుల్ గాంధీ స్పందన

సీబీఎఫ్‌సీని కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని విమర్శ

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో

విజయ్ పార్టీకి దగ్గరయ్యే ప్రయత్నమంటున్న విశ్లేషకులు



02

# మేడారం జాతరకు ప్రత్యేక యాప్!



మొదటిపేజీ తరువాయి

సమీక్ష సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు, ఉన్నతాధికారులు, వివిధ శాఖల కార్యదర్శులు, ములుగు జిల్లా కలెక్టర్ దివాకర పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ, గత జాతరకు సుమారు కోటిన్నర మంది భక్తులు హాజరుకాగా, ఈసారి ప్రభుత్వం రూ.150 కోట్ల నిధులు కేటాయించి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నందున భక్తుల సంఖ్య భారీగా పెరుగుతుందని చెప్పారు. సమ్మక్క-సారలమ్మ జాతరను కుంభమేళాను మించి ఘనంగా నిర్వహించి తెలంగాణకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని అధికారులకు పిలుపునిచ్చారు. మౌలిక వసతులు, రహదారులు, పార్కింగ్, భద్రత, రవాణా, వైద్య సేవలు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. భక్తులు సులభంగా గమ్యానికి చేరుకునేలా ప్రధాన రహదారులు, అంతర్గత మార్గాల్లో దిశా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణకు స్పష్టమైన రూట్ మ్యాప్‌లు, అవసరమైన చోట వన్‌వే విధానం అమలు చేయాలని ఆదేశించారు.

పంచాయితీ రాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ, జాతర ఏర్పాట్లకు రూ.150 కోట్లతో పాటు గద్దెల పునరుద్ధరణకు రూ.101 కోట్లను ముఖ్యమంత్రి మంజూరు చేశారని తెలిపారు. మొత్తం రూ.251 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. భక్తులకు సాఫీగా దర్శనం కల్పించడమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. శానిటేషన్, తాగునీరు, టాయిలెట్లు, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని సీతక్క పేర్కొన్నారు. రోజుకు కనీసం 40 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున దానికి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు మాట్లాడుతూ, జాతర ఏర్పాట్లను ముఖ్యమంత్రి నిత్యం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. భక్తులకు అవసరమైన సమాచారం అందించేందుకు ప్రత్యేక యాప్ లేదా క్యూ ఆర్ కోడ్ రూపొందించి ప్రచారం చేయాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణకు డ్రోన్ల వినియోగం, పార్కింగ్ ప్రాంతాల్లో తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. మేడారం జాతర ఏర్పాట్ల పురోగతిపై ములుగు జిల్లా కలెక్టర్ దివాకర పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జాతర కోసం రూపొందించిన ప్రత్యేక లోగో, యాప్, వీడియోలను మంత్రులు ప్రధాన కార్యదర్శి ఆవిష్కరించారు.

## వీరభద్ర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

- కేంద్ర మంత్రి బండి సంజయ్



హైదరాబాద్, (సిద్దిపేట పవర్):

కేంద్ర హోం సహాయ శాఖ మంత్రి బండి సంజయ్ మంగళవారం హనుమకొండ జిల్లా, భీమదేవరపల్లి మండలంలోని కొత్తకొండ వీరభద్ర స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని తెలిపారు. ప్రజలు ప్రకృతితో ముడిపడి సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. వీరభద్ర స్వామి చెడు ఆలోచనలు ఉన్న వారిలో మార్పు తీసుకురావగల దేవుడు అని కొనియాడారు. దేశం సుభిక్షంగా, ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ అశోక్ ముఖర్జీ, ఆలయ ఈవో కిషన్ రావు, ఇతర డైరెక్టర్లు మరియు భక్తులు పాల్గొన్నారు.

'వీబీ జీరామ్ జీ' పథకంపై బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ పథకం ద్వారా ఉపాధి కూలీల ఆదాయం రెట్టింపు అవుతుందని తెలిపారు. పథకం ద్వారా ఏడాదికి 200 రోజుల ఉపాధి అందేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కేంద్రం జోక్యం లేకుండా పథకం అమలు జరుగుతుందని, గతంలో కంటే అదనంగా రూ.17,000 కోట్లు ఈ పథకానికి మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణలో ప్రత్యేకంగా ఈ పథకానికి రూ.340 కోట్లు వనరులు కేటాయించనున్నారు. వ్యవసాయ సీజన్ సమయంలో పనులు జరుగకపోవడంతో కూలీలు అందుబాటులో ఉంటారని మంత్రి పేర్కొన్నారు.

## శంకుస్థాపనలు మీవి.. పనులు మావి.!

- బీఆర్ఎస్ వైఫల్యాలపై గట్టి దాడి
- కేటీఆర్ కు మున్సిపల్ 'సెమీఫైనల్' ఛాలెంజ్
- కృష్ణా జలాల్లో రాష్ట్ర ప్రయోజనాలే ప్రధానం



హైదరాబాద్, (సిద్దిపేట పవర్):

బీఆర్ఎస్ నాయకత్వంపై , గత ప్రభుత్వంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిప్పులు చెరిగారు. మహబూబాబాద్‌లో జరిగిన పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎదుర్కొంటున్న సవాళ్లను, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూనే, ప్రతిపక్షాలకు గట్టి హెచ్చరికలు జారీ చేశారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేకపోయినప్పటికీ, ప్రతి రూపాయిని పొదుపు చేస్తూ పేదల కోసం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. "గత ప్రభుత్వం కేవలం శంకుస్థాపనలకే పరిమితమైంది తప్ప, పనుల కోసం నిధులు కేటాయించలేదు. కానీ మా ప్రజా ప్రభుత్వం మాటల కంటే చేతలకు ప్రాధాన్యత ఇస్తోంది" అని ఆయన స్పష్టం చేశారు.

పదేళ్ల కుటుంబ పాలనలో రాష్ట్రాన్ని ఆగమాగం చేశారని పొంగులేటి మండిపడ్డారు. కనీసం లక్ష రూపాయల రుణమాఫీ కూడా చేయలేకపోయిన బీఆర్ఎస్ నాయకులు, ఇప్పుడు తమ ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. "దశాబ్ద కాలంలో పేదలకు ఒక చిన్న ఇల్లు కూడా ఇవ్వలేని వారు, ఈరోజు మాట్లాడుతున్నారు. మేం పార్టీలతో సంబంధం లేకుండా, అర్హులైన ప్రతి పేదవాడికి ఇళ్లు నిర్మిస్తున్నాం" అని ఆయన వివరించారు.

కేటీఆర్ చేస్తున్న విమర్శలపై స్పందిస్తూ.. మాయ మాటలతో రెండుసార్లు అధికారంలోకి వచ్చిన వారు, మళ్ళీ అధికారం కోసం పిచ్చి వేషాలు వేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికలను సెమీ ఫైనల్ అని అంటున్న కేటీఆర్ కు, "రా.. ఈ గేమ్ ఆడదాం" అంటూ బహిరంగ సవాల్ విసిరారు. రాష్ట్రాన్ని అగ్నిగుండం చేస్తామంటే ఎవరూ చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

గత ప్రభుత్వ హయాంలో జరిగిన జిల్లాల పునర్విభజన అశాస్త్రీయంగా ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఒక్కో నియోజకవర్గం మూడు జిల్లాల్లో విస్తరించి ఉండటం వల్ల పరిపాలన పరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. తమది ప్రజా ప్రభుత్వమని, నాలుగు గోడల మధ్య కాకుండా ప్రజల మధ్యే నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కృష్ణా జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలే తమకు ముఖ్యమని, ఎట్టి పరిస్థితుల్లోనూ రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టబోమని మంత్రి తేల్చి చెప్పారు. చివరగా, మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీకి అడ్డా అని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో అన్ని స్థానాలను కైవసం చేసుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ రికార్డ్

- ఖరీఫ్ సీజన్‌లో 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- గతంలో 70.2 లక్షల మెట్రిక్ టన్నుల రికార్డును అధిగమించినట్లు వెల్లడి
- రైతుల భాగస్వామ్యంతో రికార్డు సాధ్యమైందని వెల్లడి



హైదరాబాద్, (సిద్దిపేట పవర్):

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రక్రియలో చారిత్రక మైలురాయిని అధిగమించిందని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. 202526 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రికార్డు సృష్టించిందని తెలిపారు. గతంలో కొనుగోలు చేసిన 70.2 లక్షల మెట్రిక్ టన్నుల రికార్డును ఈ ఖరీఫ్ సీజన్‌లో అధిగమించినట్లు వెల్లడించారు.

పౌరసరఫరాల శాఖ, నీటిపారుదల శాఖలు సమన్వయంతో పాటు రాష్ట్ర రైతుల భాగస్వామ్యంతోనే ఈ రికార్డు సాధ్యమైందని మంత్రి స్పష్టం చేశారు. ధాన్య సంపదకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి పండుగ జరుపుకుంటున్న రైతులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రభుత్వం కొనుగోలు చేసిన 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంలో 32.45 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దొడ్డు రకం కాగా, 38.37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సన్న రకాలని మంత్రి వెల్లడించారు. తెలంగాణలో సాధించిన ఈ దిగుబడికి రాష్ట్రవ్యాప్తంగా 13.97 లక్షల మంది రైతులకు మద్దతు ధర అందించామని ఆయన అన్నారు.

## బాబుకు రేవంత్ సంక్రాంతి గిఫ్ట్..



మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం వేసిన పిటిషన్ డిస్మిస్ కావడం.. మళ్లీ సూట్ రూపంలో వస్తామని చెప్పడం అంటే ప్రభుత్వం పూర్తిగా విఫలమైనట్టేనని మండిపడ్డారు. అత్యున్నత ధర్మాసనం సాక్షిగా రేవంత్ ద్రోహపు బుద్ధి, నిజస్వరూపం బట్టబయలైందని, ఆయన ముమ్మాటికీ తెలంగాణ వ్యతిరేకి అనే విషయం తేటతెల్లమైందని ఆయన స్పష్టంచేశారు. ఈ మేరకు సోమవారం హరీశ్‌రావు మీడియాకు ఓ వీడియో విడుదల చేశారు.

నాడు పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుపై రైతులతో రిట్ వేయించి మరీ ఏపీ ప్రభుత్వం స్టే సాధించిందని.. ఇక్కడి చేతగాని కాంగ్రెస్ సర్కార్ మాత్రం ఉద్దేశపూర్వకంగానే విచారణ అర్హతలేని పిటిషన్ వేసిందని ఆరోపించారు. ఈమాత్రం దానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూటూ బూటు వేసుకొని ఢిల్లీ వెళ్లాలా? ఈ మాత్రం విషయం మీ సుప్రసిద్ధ న్యాయవాది, ఎంపీ అభిషేక్ మను సింఘ్వీకి తెలియదా?' అంటూ ప్రశ్నాస్త్రాలు సంధించారు.

**ముందునుంచీ ఏపీకి రేవంత్ దాసోహం**

సివిల్ సూట్ వేస్తామని చెప్పడం అంటే, పోలవరంనల్లమలసాగర్ ప్రాజెక్టు కట్టుకోవడానికి ఏపీకి గడువు ఇవ్వడమేనని హరీశ్‌రావు విమర్శించారు. ఏపీ, తెలంగాణతో పాటు, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల వాదనలు వినడం అనేది ఇక ఏండ్లు గడిచినా ముగియని కథేనని స్పష్టంచేశారు. సుప్రీంలో వాదనలు వినేలోగా చంద్రబాబు ప్రభుత్వం నల్లమల పనులు పూర్తిచేసుకొని, తెలంగాణ నీటి హక్కులను కాలరాస్తూ అప్పనంగా తరలించుకుపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పోలవరంనల్లమల సాగర్ విషయంలో ముందునుంచీ రేవంత్ సర్కార్ ఒక పద్ధతి ప్రకారం ఏపీకి సహకరిస్తూ దాసోహమవుతున్నదని ఆరోపించారు.

**నీటి హక్కుల కోసం బీఆర్ఎస్ పోరు**

బీఆర్ఎస్ నిలదీస్తే బనకచర్లను అడ్డుకుంటాం, సుప్రీంకు వెళ్తాం అని నమ్మబలికిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఉద్దేశపూర్వకంగానే ద్రోహం చేశారని హరీశ్‌రావు పునరుద్ఘాటించారు. 'పంచాయితీలు వద్దు.. న్యాయస్థానాలు వద్దు.. చర్చలతోనే పరిష్కరించుకుందాం అన్న రేవంత్‌రెడ్డి మాటల్లోని ఆంతర్యమేంటి? ఏపీకి గంపగుత్తగా తెలంగాణ నీటి హక్కులను అప్పజెప్పడమేనా? అంటూ సూటిగా ప్రశ్నించారు. కృష్ణా, గోదావరి నదులపై తెలంగాణ నిర్మిస్తున్న ప్రాజెక్టులను చంద్రబాబు, ఆంధ్రా ప్రభుత్వం నాడు అడుగడుగునా అడ్డుకున్నదని దుయ్యబట్టారు. చంద్రబాబుతో దోస్తీ కట్టి తెలంగాణకు అన్యాయం చేసేందుకు సిద్ధమైన రేవంత్‌ను తెలంగాణ సమాజం క్షమించబోదని తేల్చిచెప్పారు. గురుదక్షిణ కోసం రాష్ట్రానికి ద్రోహం చేస్తుంటే ప్రత్యేక తెలంగాణ సాధించిన బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోబోదని హరీశ్‌రావు ప్రకటించారు. పార్టీ అధినేత కేసీఆర్ నేతృత్వంలో కాంగ్రెస్ దుర్మార్గాన్ని ఎండగట్టి, నీటి హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తామని హెచ్చరించారు.

## ఉగాది నాటికి టిమ్స్ హాస్పిటల్ ప్రారంభం

మొదటిపేజీ తరువాయి

నిర్మాణం దాదాపు పూర్తయిందని, కొన్ని ఎలక్ట్రికల్ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని మంత్రి తెలిపారు. ఆపరేషన్ థియేటర్లు, డయాగ్నస్టిక్ విభాగాలు, ఇతర అత్యాధునిక వైద్య పరికరాల ఏర్పాటు చివరి దశకు చేరుకున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఎంఆర్ఐ వంటి భారీ వైద్య యంత్రాల ఫిట్టింగ్ పూర్తయ్యిందని వెల్లడించారు.

ప్రచార ఆర్భాటం కంటే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఉగాది నాటికి అన్ని విభాగాలతో పూర్తిస్థాయిలో ఆసుపత్రి సేవలు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. వెయ్యి పడకల సామర్థ్యంతో ఈ టిమ్స్ హాస్పిటల్‌లో అన్ని రకాల వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. గుండె సంబంధిత వ్యాధుల చికిత్సలకు సనత్‌నగర్ టిమ్స్‌ను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా అభివృద్ధి చేస్తున్నామని మంత్రి చెప్పారు. హృదయ వ్యాధులపై పరిశోధనలు కూడా ఇక్కడే నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా అత్యాధునిక ఆర్గన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సెంటర్‌ను కూడా ఈ హాస్పిటల్‌లో ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. అన్ని రకాల అవయవ మార్పిడి శస్త్రచికిత్సలకు అవసరమైన సదుపాయాలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. ఆరోగ్య శాఖలో ఉద్యోగాల భర్తీపై మంత్రి కీలక ప్రకటన చేశారు. గత రెండేళ్లలో సుమారు 10 వేల ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం మరో 7 వేలకుపైగా పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని, త్వరలో మరిన్ని నోటిఫికేషన్లు విడుదల చేస్తామని చెప్పారు. డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బందికి ఎలాంటి కొరత లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు.



## వీధికుక్కల నియంత్రణ బాధ్యత రాష్ట్రాలదే

మొదటిపేజీ తరువాయి

హెచ్చరించింది. వీధికుక్కల దాడులు పెరగడంతో రేబీస్ సహా ఇతర ప్రమాదకర వ్యాధుల ముప్పు పెరుగుతోందన్న నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ అంశాన్ని సుమోటోగా విచారిస్తోంది. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, క్రీడా సముదాయాలు వంటి ప్రజలు ఎక్కువగా ఉండే ప్రాంతాల నుంచి వీధికుక్కలను తొలగించాలని, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డాగ్ షెల్టర్లకు తరలించాలని గతంలోనే సుప్రీం కోర్టు అధికారులను ఆదేశించింది. మంగళవారం ఈ కేసును జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం మరోసారి విచారించింది. ఈ సందర్భంగా జస్టిస్ విక్రమ్‌నాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రాలు నిర్లక్ష్యం చేస్తే కుక్కల దాడుల్లో బాధితులకు భారీ మొత్తంలో పరిహారం చెల్లించేలా ఆదేశిస్తామని స్పష్టం చేశారు. అలాగే వీధుల్లో కుక్కలకు ఆహారం పెట్టే వారు వాటిని తమ ఇళ్లలోనే పెంచుకుని అక్కడే తిండి పెట్టాలని వ్యాఖ్యానించారు. తొమ్మిదేళ్ల బాలుడిపై కుక్కలు దాడి చేసిన ఘటనను ప్రస్తావించిన జస్టిస్, జంతు ప్రేమికులమని చెప్పుకునే సంస్థలు అప్పుడు ఎందుకు బాధ్యత తీసుకోలేదని ప్రశ్నించారు. మరోవైపు కుక్కలకు ఆహారం పెట్టేవారిపై వేధింపులు జరుగుతున్నాయంటూ దాఖలైన పిటిషన్‌ను స్వీకరించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఇది శాంతిభద్రతల సమస్య అని పేర్కొంటూ, బాధితులు వ్యక్తిగతంగా కేసులు నమోదు చేసుకోవాలని సూచించింది. వీధుల్లో ఉన్న అన్ని కుక్కలను తొలగించాలని తాము ఎప్పుడూ ఆదేశించలేదని ధర్మాసనం స్పష్టం చేసింది. యానిమల్ బర్త్ కంట్రోల్ నిబంధనల ప్రకారం చికిత్సకు అనర్హమైన కుక్కలను మాత్రమే షెల్టర్లకు తరలించాలని తెలిపింది. వీధికుక్కల సమస్యపై రాష్ట్రాలు వెంటనే స్పష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సుప్రీం కోర్టు మరోసారి తేల్చిచెప్పింది.

జంతు ప్రేమికులు, సొసైటీలు సుప్రీం కోర్టు తీర్పుపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. వీధికుక్కలను తొలగించడం వల్ల జంతువుల హక్కులు ఉల్లంఘించబడుతున్నాయని, వీటికి సరైన సంరక్షణ, వైద్య సహాయం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అంటున్నారు. వీధికుక్కలపై ఇలా వ్యవహరించడం కంటే వాటికి శిక్షణ ఇచ్చి నియంత్రించడం ముఖ్యమని పేర్కొంటున్నారు.



## విజయ్ సినిమా విడుదలను కేంద్రం అడ్డుకుంటోంది...

- విజయ్ సినిమా చుట్టూ రాజకీయ దుమారం
- తమిళనాడు పర్యటనలో రాహుల్ గాంధీ స్పందన
- సీబీఎఫ్‌సీని కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని విమర్శ
- అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో విజయ్ పార్టీకి దగ్గరయ్యే ప్రయత్నమంటున్న విశ్లేషకులు




హైదరాబాద్, (సిద్దిపేట పవర్):

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారాన్ని చేజిక్కించుకునేందుకు ఎన్డీఏ, ఇండియా కూటములు వ్యూహాలు రచిస్తున్నాయి. ఇదే సమయంలో నటుడు, టీవీకే అధినేత విజయ్ రాజకీయాల్లో కీలకంగా మారడంతో ఆయన పాత్రపై ఆసక్తి పెరుగుతోంది. ప్రస్తుతం ఏ కూటమిలోనూ చేరని విజయ్‌ను తమవైపు తిప్పుకునేందుకు పలు పార్టీలు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో విజయ్ నటించిన 'జన నాయగన్' సినిమా విడుదల ఆగిపోవడం రాజకీయ దుమారం రేపింది. సంక్రాంతికి విడుదల కావాల్సిన ఈ సినిమా అనూహ్యంగా వాయిదా పడటంపై కాంగ్రెస్ అగ్ర నేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. కేంద్రం జోక్యం వల్లే సినిమా విడుదల నిలిచిపోయిందని ఆయన విమర్శించారు. రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోడీపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వం తమిళ సంస్కృతిపై దాడి చేస్తోందని, కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ తమిళ ప్రజల గొంతును అణిచే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. అయితే ఇలాంటి చర్యలతో కేంద్రం విజయం సాధించదని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటి వరకు రాహుల్ గాంధీ ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి స్పందన ఇవ్వలేదు. 'జన నాయగన్' సినిమాలో రాజకీయ అంశాలు ఉండటంతోనే విడుదలకు ఆటంకం ఏర్పడిందనే ప్రచారం జరుగుతోంది. అయితే అధికారికంగా స్పష్టత లేకపోవడంతో అనేక ఊహాగానాలు తెరపైకి వస్తున్నాయి. తమిళనాడు ఎన్నికల వేళ ఈ సినిమా రాజకీయంగా ప్రభావం చూపుతుందన్న అంచనాలతోనే విడుదల నిలిచిపోయిందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. విజయ్ సినిమా అంశం ప్రస్తుతం తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.



## చెత్తకుప్పలో దొరికిన 36 తులాల నగలు.. పోలీసులకు అప్పగించిన పారిశుద్ధ్య కార్మికురాలు

- చెన్నైలోని టీ నగర్ లో ఘటన
- ఆఫీసుకు పిలిపించుకుని సత్కరించిన సీఎం స్టాలిన్
- మహిళ నిజాయతీకి రూ. లక్ష బహుమతి

**నేషనల్ బ్యూరో జనవరి 13(సిద్దిపేట పవర్):**

చెన్నైలోని టీ నగర్ లో రోడ్లు శుభ్రం చేస్తున్న ఓ పారిశుద్ధ్య కార్మికురాలికి చెత్తకుప్పలో 36 తులాల బంగారు నగలు దొరికాయి. వెంటనే ఆమె ఆ నగల బ్యాగును తీసుకెళ్లి సమీపంలోని పోలీస్ స్టేషన్ లో అప్పగించి, వాటిని పోగొట్టుకున్న వారికి అందజేయాలని కోరింది. సోషల్ మీడియా ద్వారా ఈ విషయం తెలుసుకున్న సీఎం ఎంకే స్టాలిన్.. సదరు కార్మికురాలిని తన ఆఫీసుకు పిలిపించుకుని సత్కరించారు. ఆమె నిజాయతీని మెచ్చుకుంటూ రూ.లక్ష బహుమతిగా అందించారు. వివరాల్లోకి వెళితే.. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్లో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న పద్మ (45) ఆదివారం ఎప్పటిలాగే విధుల్లో నిమగ్నమైంది. టీ నగర్ లోని ముపాతు అమ్మన్ కోయిల్ వీధిలో రోడ్లను శుభ్రం చేస్తోంది. మధ్యాహ్నానికి విధులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు బయలుదేరింది. ఈ క్రమంలో రోడ్డు పక్కనే ఉన్న ఓ తోపుడు బండిపై ప్లాస్టిక్ బ్యాగ్ కనిపించింది. చుట్టూ ఎవరూ లేకపోవడంతో బహుశా అందులో చెత్త నింపి అక్కడ వదిలేసి వెళ్లారేమోనని భావించింది. దానిని చెత్తకుప్పలో పడేద్దామనుకుని, అసలు ఆ బ్యాగులో ఏముందో చూద్దామని అనుకుంది. బ్యాగు తెరచిచూడగా బంగారు నగలు కనిపించాయి. దీంతో అక్కడే కాసేపు ఎదురుచూసిన పద్మ.. ఆ నగల కోసం ఎవరూ రాకపోవడంతో బ్యాగును నేరుగా పాండీ బజార్ పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లి అప్పగించింది. పోలీసులు ఆ బ్యాగును పరిశీలించగా.. మొత్తం 36 తులాల బంగారు నగలు ఉన్నట్లు తేలింది. వాటి విలువ సుమారు రూ.45 లక్షలకు పైనే ఉంటుందని పోలీసులు తెలిపారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. రమేష్ అనే వ్యక్తి వాటిని పోగొట్టుకున్నట్లు గుర్తించారు. తన స్నేహితుడితో మాట్లాడుతున్న సమయంలో నగల బ్యాగును తోపుడు బండిపై పెట్టిన రమేష్.. తర్వాత బ్యాగును మరిచిపోయి వెళ్లినట్లు గుర్తించారు. ఆ నగలను కొన్న పత్రాలను పరిశీలించిన తర్వాత పోలీసులు వాటిని రమేష్ కు అప్పగించారు.

**సీఎం స్టాలిన్ ప్రశంసలు..**

ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ముఖ్యమంత్రి స్టాలిన్ సోమవారం పద్మను సచివాలయానికి ఆహ్వానించి.. ఆమెను శాలువాతో సత్కరించారు. ఆమె నిజాయతీకి గుర్తింపుగా ప్రభుత్వం తరపున రూ. 1 లక్ష నగదు పురస్కారాన్ని అందజేశారు.

## చైనా మాంజా ప్రమాదాలపై ఎస్హెచ్ఆర్సీ స్పందన

- అడ్వకేట్ రామారావు పిటిషన్...
- హైదరాబాద్ సీపీ సజ్జనార్ కు నోటీసులు

**సికింద్రాబాద్, జనవరి 13 ( సిద్దిపేట పవర్ ):**

చైనా మాంజా ప్రమాదాలను అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారంటూ ప్రముఖ మానవ హక్కుల న్యాయవాది రామారావు ఇమ్మనేని దాఖలు చేసిన పిటిషన్పై తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (ఎస్హెచ్ఆర్సీ) స్పందించింది.ఈ మేరకు హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ కు నోటీసులు జారీ చేసింది. చైనా మాంజా వల్ల జరుగుతున్న ప్రమాదాలు, తీసుకుంటున్న చర్యలపై ఫిబ్రవరి 26లోపు



సమగ్ర నివేదిక సమర్పించాలని ఎస్హెచ్ఆర్సీ ఆదేశాలు ఇచ్చింది.చైనా మాంజా కారణంగా ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతున్న నేపథ్యంలో ఈ అంశంపై తక్షణ చర్యలు తీసుకోవాలని కమిషన్ స్పష్టం చేసింది.

## బక్రిచెప్యాలలో ఘనంగా ముగ్గుల పోటీలు

**సిద్దిపేట**

సిద్దిపేట అర్బన్ మండలం బక్రిచెప్యాల గ్రామంలో గ్రామ సర్పంచ్ జక్కుల శ్రీలత శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద మహిళలు సంక్రాంతి పండగను ప్రతిబింబించేలా రంగు రంగుల ముగ్గులు వేశారు. దశమి ఆసుపత్రి నిర్వహకుడు శ్రీకాంత్ సౌజన్యంతో ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు మొదటి, ద్వితీయ, తృతీయ నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయితీ సెక్రటరీ శ్రీవాణి, గ్రామ సర్పంచ్ జక్కుల శ్రీలతశ్రీనివాస్, మాజీ సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ నరేష్, వార్డు మెంబర్లు శ్రీనాథ్, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.




# తెలంగాణ మున్సిపల్ ఎన్నికలకు అంతా సిద్ధం..

మొదటిపేజీ తరువాయి


జనాభా ప్రొఫైల్ ను, అలాగే స్థానిక రాజకీయాల్లో మహిళా ఓటర్ల పాత్రను సూచిస్తున్నాయి. నిజామాబాద్ కార్పొరేషన్లో అత్యధికంగా 3,48,051 మంది ఓటర్లు ఉన్నట్లు నమోదయి, కొత్తగూడెం కార్పొరేషన్లో అత్యల్పంగా 1,34,775 మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు. మున్సిపాలిటీలలో ఆదిలాబాద్ మున్సిపాలిటీలో అత్యధికంగా 1,43,655 మంది ఓటర్లు ఉండగా, అమరచింత మున్సిపాలిటీలో అత్యల్పంగా 9,147 మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు. ఈ సంఖ్యలు తెలంగాణ రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల మధ్య ఓటర్ల విభజనలో ఉన్న తేడాలను ప్రతిబింబిస్తున్నాయి.

ఎన్నికల నిర్వహణలో రాష్ట్రంలోని పురపాలక శాఖ తీవ్రంగా కసరత్తు చేపట్టింది. ప్రతి మున్సిపాలిటీ, కార్పొరేషన్, వార్డు మరియు డివిజన్ల రిజర్వేషన్లను ఖరారు చేసిన తర్వాతే అధికారిక నోటిఫికేషన్ విడుదల చేయబడుతుంది. రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తిచేయడం అనేది ఎన్నికల మొత్తం పర్వంలో అత్యంత కీలకమైన దశ. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను ఖరారు చేయడం ద్వారా, వివిధ వర్గాల ప్రజలకు స్థానిక సంస్థల్లో సముచిత ప్రాతినిధ్యం లభించేలా చూడటమే ప్రధాన ఉద్దేశ్యం. రాష్ట్రంలో 117 మున్సిపాలిటీల, 6 కార్పొరేషన్ల ఎన్నికలకు ఇప్పటికే రంగం సిద్ధమైందని అధికారులు తెలిపారు. రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయిన తర్వాతే ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని షెడ్యూల్‌లను అధికారికంగా ప్రకటిస్తారు.

ఓటర్ల సంఖ్యల వివరాలు చూస్తే, రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో మహిళా ఓటర్ల సంఖ్య పురుషుల కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం. ఇది స్థానిక రాజకీయాల్లో మహిళా ఓటర్ల ప్రభావం పెరుగుతున్నట్టు సూచిస్తుంది. మున్సిపాలిటీలలో ఉన్న ఓటర్ల విభజనలోనూ పెద్ద తేడాలు ఉన్నాయి. నిజామాబాద్ కార్పొరేషన్, ఆదిలాబాద్ మున్సిపాలిటీ వంటి పెద్ద ఓటర్ల కేంద్రాలు రాజకీయంగా కీలక ప్రాధాన్యం పొందుతున్నాయి. మరోవైపు, కొత్తగూడెం కార్పొరేషన్, అమరచింత మున్సిపాలిటీ వంటి ప్రాంతాల్లో ఓటర్ల సంఖ్య తక్కువగా ఉండటం, అక్కడి స్థానిక రాజకీయాలలో తక్కువ ప్రభావాన్ని చూపే అవకాశం ఉంది.

ప్రతీ మున్సిపాలిటీ, కార్పొరేషన్ యొక్క ఓటర్ల ప్రొఫైల్ ను పరిశీలించడం ద్వారా, స్థానిక రాజకీయ వ్యూహాలను రూపొందించడానికి పార్టీలు, అభ్యర్థులు ఉపయోగించగలరు. పురుష, మహిళ, ట్రాన్స్‌జెండర్ ఓటర్ల సంఖ్యల ఆధారంగా అభ్యర్థులు తమ ప్రచార వ్యూహాలను మార్చుకుంటారు. ముఖ్యంగా మహిళా ఓటర్లకు ప్రత్యేక శ్రద్ధను ఇవ్వడం, స్థానిక సమస్యలపై అవగాహన పెంచడం, వారి సమస్యలను పరిష్కరించడంలో తమ నిబద్ధతను చూపడం, ఎన్నికల్లో విజయం సాధించడానికి కీలకంగా ఉంటుంది. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారుల కృషి విస్తృతంగా కొనసాగుతోంది. రిజర్వేషన్లను ఖరారు చేయడం, వార్డులు, డివిజన్లను సరిచూసుకోవడం, ఎన్నికలకు సంబంధించిన లాజిస్టిక్ ఏర్పాట్లు చేయడం వంటి కార్యకలాపాలు పూర్తి స్థాయిలో జరుగుతున్నాయి. ప్రతి మున్సిపాలిటీ, కార్పొరేషన్, వార్డు, డివిజన్ లో ఓటర్ల రిజిస్ట్రేషన్ సరిగా ఉందా, పాత, అనవసర రికార్డులు తొలగించబడ్డాయా, కొత్తవారి వివరాలు సరిగ్గా జోడించబడ్డాయా అనే విషయాలను సమగ్రంగా పరిశీలిస్తున్నారు.

ఎన్నికల సమయంలో జరగే రిజర్వేషన్ల ప్రక్రియ కూడా ముఖ్యమైనది. ఇది స్థానిక వర్గాల ప్రజలకు సముచిత ప్రాతినిధ్యం లభించేలా చూసే దశ.




రిజర్వేషన్లు ఖరారు అయిన తర్వాతే అధికారిక నోటిఫికేషన్ విడుదల చేస్తారు, తద్వారా అభ్యర్థులు తమ అభ్యర్థిత్వాన్ని నమోదు చేసుకోవడానికి, ప్రచారం ప్రారంభించడానికి సిద్ధమవుతారు. రాష్ట్రంలో 117 మున్సిపాలిటీల, 6 కార్పొరేషన్ల ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిగా జరుగుతున్నాయి.

ఇవ్వబడిన ఓటర్ల సంఖ్యలు, రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల జనాభా నిర్మాణాన్ని, మహిళా ఓటర్ల శక్తిని, స్థానిక రాజకీయాల్లో వర్గాల ప్రాధాన్యతను తెలియజేస్తాయి. నిజామాబాద్, ఆదిలాబాద్, కొత్తగూడెం, అమరచింత మున్సిపాలిటీల ఓటర్ల సంఖ్యలు ప్రత్యేకంగా గమనించదగ్గవి. ఈ వివరాలు పార్టీలు, అభ్యర్థులు తమ ఎన్నికల వ్యూహాలను రూపొందించడానికి కీలకంగా ఉపయోగిస్తారు. మొత్తం రిజిస్ట్రేషన్, రిజర్వేషన్, నోటిఫికేషన్ ప్రక్రియలను సమయానికి పూర్తి చేయడం ద్వారా ఎన్నికలు సమర్థవంతంగా, న్యాయసంగతంగా, సరళమైన విధంగా నిర్వహించగలుగుతాయి.

ఈ విధంగా, తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్నాయి, రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తూనే ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల ద్వారా ప్రజలకు సముచిత ప్రాతినిధ్యం లభించడంతోపాటు, ప్రాంతీయ రాజకీయాలలో కొత్త గణాంకాలు, మార్పులు ప్రతిబింబించనున్నాయి. రాష్ట్రంలోని మొత్తం 117 మున్సిపాలిటీల, 6 కార్పొరేషన్ల స్థానిక ఎన్నికలకు రంగం సిద్ధమైందని అధికారులు తెలియజేశారు, ప్రతి వర్గానికి తగిన ప్రాతినిధ్యం, మహిళా ఓటర్ల శక్తి, మరియు ట్రాన్స్‌జెండర్ ఓటర్లలోని భాగస్వామ్యం election results ని ప్రభావితం చేస్తుంది.

మొత్తం లెక్కల్లో, ఈ ఎన్నికలు తెలంగాణలో స్థానిక రాజకీయాలు, జనాభా ప్రాధాన్యతలు, మహిళా ఓటర్ల ప్రాధాన్యం, వర్గీయ ప్రతినిధ్యాలను ప్రతిబింబించే ప్రధాన సంఘటనగా నిలుస్తాయి. పునఃరాజ్యాంగ ప్రకారం ప్రతి మున్సిపాలిటీ, కార్పొరేషన్, వార్డు, డివిజన్ లో రిజర్వేషన్లు, ఓటర్ల లెక్కలు సరిగా నిర్వహించడం ద్వారా ప్రజలకు న్యాయ, సముచిత ప్రాతినిధ్యం కల్పించబడుతుంది.

# మీడియాపై సిట్ వేశారు సరే... మీ నేతల స్కాంలపై ఎందుకు వేయలేదు?

మొదటిపేజీ తరువాయి

దానిపై సిట్ లేదు. ములుగు జిల్లాలో మంత్రి పీఏ ఇసుక దందాలో కోట్లు దండుకుంటే చర్యలు లేవు. రెవెన్యూ మంత్రి కుమారుడు వందల కోట్ల భూకబ్జాకు పాల్పడితే, కేసు పెట్టిన పోలీస్ అధికారి బదిలీ అయ్యారు కానీ, కబ్జాపై విచారణ లేదు" అని కేటీఆర్ ఆరోపించారు.

అంతేకాకుండా, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ ఓ కాంట్రాక్టర్‌ను రూ.8 కోట్ల కోసం బెదిరించారని, కస్తూర్బా గాంధీ పాఠశాలల బంకర్ బెడ్స్ కొనుగోలులో రూ.100 కోట్ల కుంభకోణం జరిగిందని, లిక్కర్ హోలోగ్రామ్ టెండర్ వివాదం, చీప్ లిక్కర్ కంపెనీలకు అక్రమ అనుమతులు వంటి అనేక స్కామ్‌లపై ప్రభుత్వం ఎందుకు సిట్ వేయలేదని ఆయన నిలదీశారు. యూనివర్సిటీ భూముల అమ్మకంలో భారీ మోసం జరిగిందని సుప్రీంకోర్టు కమిటీయే తేల్చినా విచారణ జరపకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు.

"అధికార పక్షానికి సన్నిహితంగా ఉండే ఓ టీవీ ఛానెల్ వేసిన వార్తను కేవలం ఉటంకించినందుకు అనేక ఛానెళ్లపై, డిజిటల్ మీడియాపై సిట్ ఏర్పాటు చేశారు. అసలు వార్త వేసిన వారిని వదిలేసి, ఈ కొత్త డ్రామా ఎవరిని కాపాడటానికి? ఎవరిని వేటాడటానికి?" అని కేటీఆర్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రశ్నించే మీడియా గొంతుకలపై వేధింపులు ఆపకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు.



## వెంకటాపురం గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

**సంగారెడ్డి,జనవరి 13(సిద్దిపేట పవర్):**

సదాశివపేట మండలం లో వెంకటాపూర్ గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో ముగ్గుల పోటీలు గ్రామ సర్పంచ్ ఓగ్గు శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీసీ సెల్ మండల్ అధ్యక్షులు మాజీ సర్పంచ్ దుర్గం బోయిని కృష్ణ సహాయ సహకారంతో పోటీలు నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథులుగా CDC చైర్మన్ రామ్ రెడ్డి , CI వెంకటేశం ,MRO బాలరాజు , ఆర్ఐ గంగాధర్ , ఆలయ అర్చకులు విజయ సారథి, అఖిలేష్ పాండే స్వామి, ముఖ్య అతిథులుగా రావడం జరిగింది ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ మహేందర్, ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేశం , వార్డ్ మెంబర్లు సునీత, డి కుమార్. డి కల్పన, పి శ్రీనివాస రెడ్డి ,పి వెంకటేశం, డి పోచన్న, జి లక్ష్మణ్.ఎం సురేష్, జంజిరాల విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.








## పలుగుగడ్డలో సంక్రాంతి ముగ్గుల పోటీలు

**సిద్దిపేట పవర్ గజ్వెల్ నియోజకవర్గం ప్రతినిధి :**

జగదేవపూర్ మండలం పలుగుగడ్డ గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా సర్పంచ్ నర్ర కనకయ్య, ఉప సర్పంచ్ నర్ర కళ్యాణి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. పండగ వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమం ఉత్సాహంగా పాల్గొని, మహిళలు వేసిన రంగు రంగుల ముగ్గులను ఆసక్తిగా తిలకించారు. స్థానిక మహిళలు తమ నైపుణ్యంతో తీర్చిదిద్దిన ముగ్గులు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతి విజేతలకు పోటీలో పాల్గొన్న అందరికీ బహుమతులు ప్రధానం చేశారు.అనంతరం గ్రామ సర్పంచ్,ఉప సర్పంచ్,పాలక వర్గం సభ్యులను గ్రామస్తులు సాల్వతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిబింబమైన ముగ్గుల పోటీలను నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి వేదికలు ఎంతగానో ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళా తన ప్రతిభను చాటుకుందని, వారిలోని ఉత్సాహం చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్టాప్ రిపోర్టర్ రామచంద్రం, గ్రామ పెద్ద మనిషి నర్ర ఇస్తారీ,వార్డు సభ్యులు హేమలత సుధాకర్,కృష్ణ,వెంకటేష్, గ్రామస్తులు నర్ర పెద్ద కనకయ్య,రమేష్, డాక్టర్ ఐలయ్య,ఆంజనేయులు, రాజు,నారాయణ, కనకయ్య, జహంగీర్ కిష్టయ్య గ్రామ మహిళలు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.



# సంక్రాంతి – ముగ్గులు : సంప్రదాయం, శాస్త్రం, స్త్రీశక్తి



ముగ్గులు ఏ ప్రదేశాన్నైనా సౌందర్యవంతంగా మార్చడమే కాక, ఆ ఇంటిని లక్ష్మీ నివాసంగా మలిచే పవిత్ర చిహ్నాలు. రంగు రంగుల డిజైన్లు మాత్రమే కాదు, ప్రతి ముగ్గు వెనుక దాగి ఉన్న శాస్త్రీయత, ఆధ్యాత్మిక భావన, సామాజిక ఉద్దేశం చాలా లోతైనవి. రోజూ మనం చూసే ఒక సాధారణ ముగ్గుకే ప్రత్యేక అర్థం ఉంది. ఆ అర్థం, కారణం, ప్రభావం ఏమిటో సంక్రాంతి సందర్భంగా తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ధనుర్మాసం (డిసెంబర్ 17 నుంచి జనవరి 14 వరకు) ముగింపు దశలో వచ్చే భోగి, సంక్రాంతి, కనుమ—ఈ మూడు రోజులు తెలుగు సంస్కృతిలో అత్యంత ప్రాధాన్యత కలిగినవిగా నిలుస్తాయి. ఈ సమయంలో ఇళ్ల ముందు వేసే పెద్ద పెద్ద ముగ్గులు, వాటిలో గొబ్బెమ్మలు, పసుపు-కుంకుమలు, పూల అలంకరణలు, మామిడి తోరణాలు—అన్నీ కలసి ఒక దైవిక వాతావరణాన్ని సృష్టిస్తాయి. గాలిపటాలతో నిండిన ఆకాశం, ఉదయించే సూర్యునికి పోటీగా మెరిసే రంగులు ఈ పండుగ ప్రత్యేకత. భోగినాడు భోగి మంటలు, పిల్లలకు భోగి పళ్లు, మహిళలకు పసుపు-కుంకుమలు, పూలు, గాజులు, చలిమిడి, కొత్త బట్టలు, తీపి పదార్థాలు—ఇవన్నీ ఆరోగ్యానికి, ఐక్యతకు, ఆనందానికి ప్రతీకలు. చలికాలంలో శరీరానికి అవసరమైన వేడి, పౌష్టికాహారం అన్నీ ఈ ఆచారాల్లో దాగి ఉన్నాయి. కనుమ నాడు వేసే స్వర్గద్వార ముగ్గులు ప్రత్యేకమైనవి. ఐదు, ఏడు, తొమ్మిది, పదకొండు, పదమూడు, పదిహేను చుక్కలతో గీతల రూపంలో వేసే ఈ ముగ్గులు కేవలం కళ కాదు—అవి ధర్మ, అర్థ, కామ, మోక్ష మార్గాల సూచికలు. పద్మాలు, శంఖాలు, చక్రాలు, చతురస్రాలు వంటి ఆకృతులు దేవతల చిహ్నాలు. వీటిని బియ్యం పిండితో సహజసిద్ధంగా, పర్యావరణానికి హాని లేకుండా రూపొందించడం మన మహిళల అపార ప్రతిభకు నిదర్శనం. ఈ సంప్రదాయంలో స్త్రీ శక్తి ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఒక తల్లిగా, సోదరిగా, భార్యగా, కూతురుగా మాత్రమే కాకుండా—సలహాదారిగా, ఉపాధ్యాయినిగా, కుటుంబ ఆర్థిక స్థంభంగా నిలుస్తూ కూడా, ఇంటిముందు ముగ్గుల రూపంలో సంస్కృతిని ఆవిష్కరించగలగడం ఆమె విశిష్టత. గణితం, శిల్పకళ, ఆధ్యాత్మికత—మూడు కలిసిన రూపమే ముగ్గు. సంక్రాంతి రోజుల్లో హరిదాసుల రాక మరో ప్రత్యేక ఆకర్షణ. 'హరి' అంటే శ్రీమహావిష్ణువు, 'దాసు' అంటే ఆయన శిష్యుడు. రంగు రంగుల దుస్తులు, గజ్జల సవ్వడి, చిరుతల నాదంతో హరిదాసు ముగ్గుల మధ్య నిలబడి కీర్తనలు చేయడం ఆ ఇంటికి మహా పుణ్యం. చిన్నారులు బియ్యం దోసిళ్లతో కలశంలో పోస్తూ ఆశీర్వాదం పొందే దృశ్యం—లక్ష్మీ స్వరూప దర్శనంలా ఉంటుంది. ఇదే సమయంలో గంగిరెద్దుల సందడి కూడా కనిపిస్తుంది. నందీశ్వరుని ప్రతీకగా భావించే గంగిరెద్దును శంఖ-చక్రాల అలంకరణలతో ముంగిటికి తీసుకువచ్చి దర్శించుకోవడం శుభప్రదం. శివ-కేశవుల అభేద భావనకు ఇది ప్రతీక. ఈ పండుగలో రైతు పాత్ర మరువలేనిది. కొత్త ధాన్యంతో పరమాన్నం చేసి భూమాతకు, అష్టదిక్పాలకులకు నైవేద్యం సమర్పించడం భారతీయ వ్యవసాయ సంస్కృతికి ప్రతీక. పల్లెల్లో 'పాతర' వేసే సంప్రదాయం భవిష్యత్తుపై ముందుచూపును చాటుతుంది. స్వర్గద్వార ముగ్గుల ద్వారా దేవతలే కాక పితృదేవతల ఆశీర్వాదాలు కూడా లభిస్తాయని విశ్వాసం. ఈ విధంగా ముగ్గుల ద్వారా ఇంటిని స్వర్గధామంగా మలిచే శక్తి భారతీయ స్త్రీలోనే ఉంది. లక్ష్మీ, సరస్వతి, పార్వతిల స్థిర నివాసానికి ఇదే మూలం. సంప్రదాయం, శాస్త్రం, ఆధ్యాత్మికత—మూడు సమన్వయమే సంక్రాంతి ముగ్గులు. ఈ విలువలను నేటి తరం అర్థం చేసుకొని ముందుకు తీసుకెళ్లడం కాల అవసరం.

**రచయిత్రి**
**-కోట ఉమా శర్మ**
**9958144884**



# సిద్దిపేటలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ 4వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న 'బ్రైడ్స్ ఆఫ్ ఇండియా షో'

- **జనవరి 10 నుండి జనవరి 18, 2026 వరకు**

**సిద్దిపేట పవర్:**

ఈ ప్రత్యేక ప్రదర్శన జనవరి 10 నుండి జనవరి 18, 2026 వరకు కొనసాగుతుంది. ప్రత్యేక ప్రదర్శన: పెళ్లి కూతుళ్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన విభిన్న రకాల పెళ్లి ఆభరణాల (Bridal Jewellery) కలెక్షన్లను ఇక్కడ ప్రదర్శిస్తున్నారు. డిజైన్లు: భారతదేశంలోని వివిధ సంస్కృతులు మరియు సంప్రదాయాలను ప్రతిబింబించేలా అద్భుతమైన బంగారు, వజ్రాల మరియు విలువైన రత్నాల ఆభరణాలు upto 30% off అందుబాటులో ఉన్నాయి. వార్షికోత్సవ ఆఫర్లు: 4వ వార్షికోత్సవం సందర్భంగా కస్టమర్ల కోసం మేకింగ్ ఛార్జీలపై తగ్గింపు. ముందస్తు బుకింగ్: రాబోయే పెళ్లిళ్ల సీజన్ దృష్ట్యా, కస్టమర్లు తమకు నచ్చిన ఆభరణాలను ముందుగానే బుక్ చేసుకునే సౌకర్యం కలదు.












# ఫార్మర్ రిజిస్ట్రీ పై రైతుల్లో గందరగోళం సృష్టించొద్దు

- **రైతుల ఖాతాలలో సన్నధాన్యం బోనస్ డబ్బులు**
- **ప్రభుత్వ పథకాల వర్తింపు కోసమే ఫార్మర్ రిజిస్ట్రీ**
- **అన్నదాతకు అందుబాటులో సరిపడా ఎరువులు**
- **గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తుంకుంటా నర్సారెడ్డి**
- **గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి**

ఫార్మర్ రిజిస్ట్రీపై రైతుల్లో గందరగోళం సృష్టించొద్దని, ప్రభుత్వ పథకాల వర్తింపు కోసమే ఈ యాప్ అందుబాటులోకి తెచ్చినట్లు గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని పిడిచెడ్ లో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు పెద్దిరెడ్డి అశోక్ రెడ్డి, గజ్వేల్ ఏడిఏ బాబు నాయక్ తో కలిసి ఎరువుల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా వారు మాట్లాడారు. రబీ సాగుకు సరిపడా ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచగా, ఇందుకోసం ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి చేసినట్లు స్పష్టం చేశారు. తద్వారా ఎరువులు దుర్వినియోగం కాకుండా చూడడంతో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వ్యవసాయ పథకాలు, వివిధ రాయితీలు, రుణమాఫీ తదితర వర్తింప చేయడానికి వీలుగా ఉంటుందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని రైతులు త్వరగా నమోదు చేసుకోవాలని, ఇందుకోసం వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలని కోరారు. అలాగే సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి ఫలితంగా ఖరీఫ్ సీజన్లో రైతుల నుండి సేకరించిన సన్నధాన్యానికి క్వింటాకు రూ 500 చొప్పున బోనస్ ఖాతాలలో జమ చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, నేతలు సుఖేందర్ రెడ్డి, మొనగారి రాజు రవీందర్ రెడ్డి కొండల్ రెడ్డి గాడిపల్లి శ్రీనివాస్ కరుణాకర్ రెడ్డి నర్సింహారెడ్డి రాజశేఖర్ రెడ్డి పిడిచేడ్ గ్రామ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# ఇసుక సరఫరాలో టోకెన్ పద్ధతిని ఎత్తివేయాలి

- **యధావిధిగా పాత పద్ధతిలోనే ఇసుక అందించాలి**
- **ఆకునూరు బీఆర్ఎస్ నాయకుల డిమాండ్**

**చేర్యాల, జనవరి 13 (సిద్దిపేట పవర్)**

ఆకునూరు గ్రామంలో పెద్దవాగు నుండి గ్రామ ప్రజలు వినియోగించుకునే ఇసుక కు పెట్టిన టోకెన్ పద్ధతి ఆంక్షలు ఎత్తివేసి పాత పద్ధతిలోనే కొనసాగించాలని బీఆర్ఎస్ ఆకునూరు గ్రామ నాయకులు శనిగరం లక్ష్మణ్, జంగిటి భిక్షపతి, మల్లమారి నవీన్ కుమార్, ముచ్చాల వంశీ డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ 10 సంవత్సరాల పాలనలో గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎలాంటి ఆంక్షలు లేకుండా సరఫరా కొనసాగించామని గుర్తు చేశారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే టోకెన్ పద్ధతిని పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. గ్రామ పరిధిలో ఉన్న గృహ నిర్మాణాలు, ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు, ఇతర ప్రజల అవసరాల కోసం వినియోగించుకునే ఇసుకకు ఎన్నడూ లేని విధంగా ఆంక్షలు పెట్టి లబ్ధిదారులను గ్రామ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఈ సమస్యపై అధికార పార్టీ నాయకులు, అధికారులు తక్షణమే స్పందించి టోకెన్ పద్ధతిని రద్దుచేసి యధావిధిగా పాత పద్ధతిలోనే ఇసుక రవాణా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఇటీవల జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.



# మొక్కల పెంపకం పనులు వెగవంతం చేయాలి

- **ఏపీఓ శైలజ**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**

జగదేవపూర్ నర్సరీలో మొక్కల పెంపక పనులను వేగవంతం చేయాలని ఏపీవో శైలజ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని తిగుల్ గ్రామంలో నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది జగదేవపూర్ మండలంలో 25 గ్రామాల్లో మొత్తం 89వేల మొక్కల పెంపకం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ప్రస్తుతం నర్సరీలో కవర్లలో మట్టిని పనులు కొనసాగుతున్నాయని అనంతరం వివిధ రకాల మొక్కలకు సంబంధించిన విత్తనాలు వేయడం జరుగుతుందన్నారు. నర్సరీ పనుల్లో నిర్లక్ష్యం వహించరాదని పనులను వేగవంతం చేయాలని సూచించారు .ఈ కార్యక్రమంలో సర్పంచ్ రజిత, రామ్ నగర్ సర్పంచ్ రజిత మల్లేశం, ఎఫ్ ఏ పార్వతి, కార్యదర్శి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాభివృద్ధి కి కలిసి పనిచేద్దాం

**చేర్యాల, జనవరి 13 (సిద్దిపేట పవర్)**

చుంచనకోట గ్రామ సర్పంచ్ గా ఎన్నికైన గుడ్ల కృష్ణ ను ఉప్పల్ ఎమ్మెల్యే పి ఎ ఆలేటి రమేష్ సన్మానించారు..ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ సర్పంచ్ గా గెలిచిన తర్వాత తమ ఇంటికి వచ్చిన సందర్భంగా ఆయన తో గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యలు, మౌలిక వసతులపై సుదీర్ఘంగా చర్చించడం జరిగింది అని తెలిపారు..అదే విధంగా గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను అభినందించిన ఆయన, భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.



# తలసాని వ్యాఖ్యలకు వ్యతిరేకంగా పీఎస్ లో కాంగ్రెస్ నేతల ఫిర్యాదు

**సికింద్రాబాద్, జనవరి 13 (సిద్దిపేట పవర్):**

బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ రెండు రోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బన్సీలాల్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. తలసాని చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమని పేర్కొన్న కాంగ్రెస్ నేతలు, వాటిని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బన్సీలాల్ పేట డివిజన్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు




# ముదిరాజ్ లు ఉన్నత స్థాయి కి ఎదగాలి..

- **విద్యార్థులకు పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కు సన్మానం..**

**సిద్దిపేట జనవరి13**

2024 25 వ సంవత్సరంలో ఉత్తమ విద్యార్థుల కు మరియు ఉద్యోగ విరమణ పొందిన వారికి రంగదాంపల్లి ముదిరాజ్ సంఘము ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం హర్షించదగ్గ విషయమని రంగదాంపల్లి ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు ఈర్ల సత్తయ్య అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 202425 వ సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్ లో అత్యధిక మార్కులు సాధించి ఉద్యోగ విరమణ చెందిన ఉద్యోగుల కు రంగదాంపల్లి పెద్దమ్మ దేవాలయం వద్ద వారిని ఘనంగా సన్మానించడం జరిగిందని..ముదిరాజ్ లు ఆర్థికంగా అభివృద్ధి చెంది అలాగే ముదిరాజ్ లు ఉన్నత స్థాయి కి ఎదగాలని వారన్నారు..ఈ కార్యక్రమంలో రంగదాంపల్లి ముదిరాజ్ సంఘము సభ్యులకు తదితరులు పాల్గొన్నారు..



# చైన మాంజా వద్దు అది మన ప్రాణానికే ముప్పు



- **జగదేవపూర్ ఉప సర్పంచ్ మచ్చ గణేష్**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**

చైనా మంజా తో యువతి యువకులు దూరంగా ఉండాలని జగదేవపూర్ మేజర్ గ్రామ ఉప సర్పంచ్ మచ్చ గణేష్ అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగా అనగానే పిండి వంటలతో పాటు గాలి పటాలు గుర్తుకొస్తుంటాయి.చిన్న పిల్లలు,పెద్దలు అనే తేడా లేకుండా గాలి పటాలు ఆనందంతో ఎగిరేస్తుంటామని,ఈ గాలి పటాలు ఉపయోగించే దారం చైనా మంజా వాడొద్దు అంటూ వీటి వల్ల చాలా ప్రమాదం ఉందని చెప్పారు. చిన్న పిల్లలను ద్వీచక్ర వాహనం పై వెళ్లేటప్పుడు నెమ్మదిగా వెళ్ళాలన్నారు. మంజా దారం మెడకు చుట్టుకునే ప్రమాదం ఉంది. కనుక మనము వాహనం పై వెళ్ళేటప్పుడు మెడకు మఫ్లర్ లేదా రుమాలు లాంటిది కట్టుకోవడం వల్ల మనకు చైనా లాంటి మంజా వల్ల రక్షణ ఉంటుందన్నారు. రాబోయే 5 రోజుల పాటు తగు జాగ్రత్తలు తీసుకొని ముందుకు నడవాలన్నారు.చైనా మాంజా కాకుండా మామూలు దారం వాడి పండుగను ఆనందంగా గడపాలన్నారు. చైనా మంజా కు దూరం గా ఉండాలని అనర్థాలను, ప్రమాదాలను పొంచి ఉండే అవకాశం ఉందని చెప్పారు. గాలి పటాలు ఎగురవేసేందుకు వినియోగించే చైనా మాంజా కనిపించని పదునైన కత్తిలాంటిదన్నారు. దీనిని గాజుముక్కలు, ఇంకా కొన్ని రసాయనాలు వినియోగించి తయారు చేయడంతో అది భూమిలో కలిసినా తొందరగా పాడవని లక్షణం కలిగి ఉంటుందని తెలిపారు. ద్విచక్రవాహనదారులు, అలాగే ఆకాశంలో స్వేచ్ఛగా విహరించే పక్షులకు ప్రాణాంతకంగా మారుతుందని తెలిపారు. గాలిపటాలు ఎగురవేసే సమయంలో రోడ్డుకు ఈదారం అడ్డుగా ఉంటే ఆదారిలో ప్రయాణించే ద్విచక్రవాహనచోదకుల మెడకు చుట్టుకుని ప్రాణాలు పోయే పరిస్థితి ఏర్పడుతుందని వివరించారు.ఎవరైనా చైనా మాంజా విక్రయిస్తే సమీప పోలీస్టేషన్ కు, లేదా గ్రామ పంచాయతీకి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ప్రాణం కంటే ఏది ముఖ్యం కాదన్నారు. గ్రామ ప్రజలందరికీ భోగి , సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## బి రమేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు



**సిద్దిపేట:**

సిద్దిపేట పట్టణంలోని భారత్ నగర్ లో మాజీ మున్సిపల్ చైర్మన్ విగ్రహం వద్ద బి రమేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. బి రమేష్ ఫౌండేషన్ చైర్మన్ మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బాసంగారి వెంకట్ పిల్లలకు పతంగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం బి రమేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు.గత 15 సంవత్సరాల నుండి తన తండ్రి గారి పేరిట బి రమేష్ ఫౌండేషన్ స్థాపించి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.



## బస్వాపూర్ గ్రామంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు

- **గ్రామ సర్పంచ్ ఆలేటి కవిత లోలాకర్ రెడ్డి**



**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి:**

జగదేవపూర్ మండలం బస్వాపూర్ గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామ ఫంక్షన్ హాల్లో స్థానిక సర్పంచ్ ఆలేటి కవిత లోలాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకొని ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్థానిక మహిళలు తమ నైపుణ్యంతో తీర్చిదిద్దిన ముగ్గులు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిబింబమైన ముగ్గుల పోటీలను నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి వేదికలు ఎంతగానో ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళా తన ప్రతిభను చాటుకుందని, వారిలోని ఉత్సాహం చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అద్భుతమైన కళాఖండాల వంటి ముగ్గులను వేసిన మహిళలను సర్పంచ్ ప్రత్యేకంగా అభినందించి, వారిని ప్రోత్సహించారు.

# తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి వివేక్ వెంకటస్వామి

**సిద్దిపేట పవర్ ప్రతినిధి, జనవరి 13:**





సిద్దిపేట కలెక్టరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సోమవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, ఆర్టీఏ కమిటీ సభ్యులు సూర్య వర్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, కలెక్టరేట్ ఉద్యోగులు, టీఎన్జీఓ నాయకులు, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ తెలంగాణ తల్లి విగ్రహంలోనే తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయని అన్నారు. అందేశ్రీ శ్రీ రచించిన జయజయహే తెలంగాణ గీతం, తెలంగాణ తల్లి విగ్రహాలు రాష్ట్ర ప్రజాపాలనను ప్రజలకు తెలియజేసే ప్రతీకలుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజలు కోరుకున్న విధంగా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తోందని స్పష్టం చేశారు.

ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలతో పాటు, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ వంటి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పేద ప్రజల కోసం అమలు చేస్తున్నామని తెలిపారు. గతంలో కొందరికి మాత్రమే పరిమితమైన సంక్షేమ పథకాలు ఇకపై అన్ని వర్గాల ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు.

ఇప్పటికే దుబ్బాక పట్టణంలో రూ.10 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని, అలాగే నాంచారిపల్లి గ్రామంలో రూ.10 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని తెలిపారు. త్వరలోనే సిద్దిపేట పట్టణంలో రూ.15 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ప్రకటించారు. జిల్లా కలెక్టర్ నేతృత్వంలో జిల్లా యంత్రాంగం ప్రజలందరికీ సంక్షేమ పథకాలు వేగంగా చేరేలా సమన్వయంతో పని చేస్తోందని మంత్రి అభినందించారు.

ఈ కార్యక్రమం తెలంగాణ సంస్కృతి, ప్రజా పాలన పట్ల అవగాహన పెంచే దిశగా ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలిచిందని అభిప్రాయపడ్డారు.



## శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కరుణ అందరిపై ఉండాలి

- **గోలి సంతోష్**
- **శ్రీ వెంకటేశ్వర స్వామి మాలధారణ స్వాములకు, మాతలకు ఆతిథ్యం**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ ప్రతినిధి:**

గజ్వేల్ పట్టణం లో బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కొండ పోచమ్మ దేవస్థానం మాజీ డైరెక్టర్ గోలి సంతోష్ మమత దంపతుల ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామి మాల ధారణ స్వాములకు మాతలకు ఆతిథ్యం అందజేశారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ తాజా మాజీ చైర్మన్ రాజమౌళి మాట్లాడుతూ కలియుగ వైకుంఠ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి కరుణ కటాక్షాలతో అందరూ బాగుండాలని కోరుకుంటూ, వ్యాపారంలో రాణిస్తూ దైవ కార్యక్రమాలలో సేవా కార్యక్రమాలలో ముందు వరుసలో ఉంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న గోలి సంతోష్ ను అభినందించి, ప్రతి ఒక్కరు దైవభక్తి కలిగి ఉండాలని అన్నారు, అనంతరం గోలి సంతోష్ మాట్లాడుతూ, మానవసేవే మాధవ సేవ అని నా వంతు సమాజానికి సేవ చేస్తూ దైవ కార్యక్రమాల్లో పాల్గొనడం జరుగుతుందని అందులో భాగంగా, ధనుర్మాసం ముగింపు సందర్భంగా, శ్రీ వెంకటేశ్వర మాల ధారణ స్వాములకు మాటలకు చిరు ఆతిథ్యం అందజేయడం జరిగిందని, ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు, ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేట్37 వార్డులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

- **భోగి పండుగ విశిష్టతను చాటిన రంగవల్లులు**
- **విజేతలకు బహుమతులు అందించిన వార్డ్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బొమ్మల అన్నపూర్ణ యాదగిరి**

**జనంతోడు సిద్దిపేట జనవరి 14:**

కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే మహిళల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టడం జరిగిందనీ 37వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బొమ్మల అన్నపూర్ణ యాదగిరి అన్నారు. సంక్రాంతి పర్వదినాన్నీ పురస్కరించుకొని వార్డులోని మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు సిద్దిపేట పట్టణం లోని 37 వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బొమ్మల అన్నపూర్ణ యాదగిరి ఆధ్వర్యంలో భోగి పండుగ సందర్భంగా మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. రంగవల్లుల పోటీల్లో దాదాపు 100 పైగా మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు రైస్ కుక్కర్, మిక్సీ, వాటర్ బాటిల్స్ తో పాటు పలు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర మైనార్టీ సెల్ వైస్ చైర్మన్ ఎండి కలిముద్దీన్ ,ప్రత్యేక ఆహ్వానితులుగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎండి షాబుద్దీన్ జిల్లా కాంగ్రెస్ నాయకులు మెరుగు రాజు , పట్టణ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గ్యాదరి మధు, జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శి బొమ్మల ప్రవీణ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు యువజన కాంగ్రెస్ నాయకులు బొమ్మల చంద్రశేఖర్, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పుట్ల ప్రసాద్,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బుర్క సందీప్, దువ్వల వంశీ, బొమ్మల సందీప్, చరణ్, సాయి, భువన,బండి వెంకటే్, మహిళలు యువకులు పాల్గొన్నారు



## సిద్దిపేటలోని యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ లో యువజన దినోత్సవం



సిద్దిపేటలోని యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో జాతీయ యువజన దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణ సంస్థలో శిక్షణ పొందుతున్న విద్యార్థినిలకు యోగా శిక్షకులు బీర్కూరి మనోహర్ గారి చే గత 14 రోజులుగా యోగా శిక్షణను అందించి వారికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందించడం జరిగింది. యువజన దినోత్సవం పురస్కరించుకొని సంస్థ డైరెక్టర్ మాట్లాడుతూ బలమే జీవనం బలహీనతే మరణం అని స్వామి వివేకానంద తెలిపారని వ్యక్తిగతంగా ఆరోగ్యంగా ఉంటే సమాజం భారతదేశం అభివృద్ధి పథంలో నడుస్తుందని అన్నారు. వ్యక్తి ఆరోగ్యం కోసం ప్రతి రోజు యోగ చేయాలని తద్వారా మంచి ఆరోగ్యాన్ని, మానసిక ప్రశాంతతను, మానసిక వికాసాన్ని పొందాలని సూచించారు ప్రతి సంవత్సరం స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని జాతీయ యువజన దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. స్వామి వివేకానంద యువతకు దిశా నిర్దేశం చేసిన మహనీయుడని ఆయన ఉపన్యాసాలు విశ్వవ్యాప్తంగా ఆదరణ పొందినయని అన్నారు. విద్యార్థినీలకు యోగా శిక్షణను అందించిన యోగా శిక్షకులు బీర్కూరి మనోహర్ ను ప్రశంస పత్రం అందించి అభినందించారు. ఈ కార్యక్రమం లో శిక్షణ సంస్థ ఫ్యాకల్టీ సిబ్బంది పాల్గొన్నారు.







